ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శుక్రవారం | 17 జులై, 2026 | పేజీలు : 08


## మహిళలకు తేనెటీగల పెంపకంపై శాస్త్రీయ శిక్షణ




# ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

### మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండలంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) గురువారం పర్యటించారు. పూసూరు గ్రామంలో సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం వాజేడు మండల కేంద్రం లోని మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు త్వరలో కుట్టు మిషన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. తదనంతరం చీకుపల్లి బొగత జలపాతం ప్రాంగణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ను ప్రారంభించారు. చీకుపల్లి గ్రామ సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో ఈ క్యాంటీన్ నిర్వహించబడుతోందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పర్యాటకులకు ఇంటి రుచులను, అమ్మ చేతి వంటను అందించడమే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు. స్థానికంగా లభించే సహజ సిద్ధమైన కూరగాయలు, సంప్రదాయ వంటకాలు, బొంగు చికెన్, చేపల వంటలు, బిర్యానీ తదితర రుచికరమైన ఆహార పదార్థాలను మహిళలే తయారు చేసి పర్యాటకులకు అందిస్తారని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని కుటుంబాలతో పాటు సమాజ అభివృద్ధికి తోడ్పడాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి, డీఎఫ్‌వో వికాస్ మీనా, ఐటీడీఏ పీఓ లెనిన్ వసల్ టొప్పో, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మదర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతక్కకు ఘన స్వాగతం పలికిన మండల నాయకులు వాజేడు మండల పర్యటన సందర్భంగా మంత్రి సీతక్కకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి సన్మానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాకర్లపూడి విక్రాంత్, దంతులూరి విశ్వనాథ ప్రసాద్ రాజు, చెన్నం ఎల్లయ్య, కాకర్లపూడి కళ్యాణ్, వత్సవాయి జగన్నాథరాజు, దాట్ల సీతారామ రాజు, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పీర్ల కృష్ణ బాబు, నాగారం సర్పంచ్ బోదబోయిన స్వరూప, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గౌరారం సర్వేశ్వరరావు, మైనార్టీ నాయకుడు ఎస్.కె. షాబీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.



### రైతులకు ఎలాంటి కొరత లేకుండా

# సకాలంలో చర్యలు

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/జనగామ:** జిల్లాలో రైతులకు యూరియా, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్లు ఎలాంటి కొరత లేకుండా సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఎస్‌హెచ్‌జీ మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల మహిళలో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 62 ఎస్‌హెచ్‌జీ మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలలో ప్రస్తుతం 44 కేంద్రాలు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా నేడు 15 ఈ పాస్ యంత్రాల పంపిణీతో మొత్తం 59 క్రియాశీల వ్యవసాయ ఇన్‌పుట్ కేంద్రాలు రైతులకు సేవలు అందించనున్నాయన్నారు. అనంరం ఎస్‌హెచ్‌జీ మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలకు 15 ఈ పాస్ యంత్రాలను కలెక్టర్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అదికారులు అంబికా సోని, డీఆర్డీవో, అదనపు డీఆర్డీవో, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్, వ్యవసాయ శాఖ సంచాలకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ‘సర్’ సర్వేను పరిశీలించిన కలెక్టర్




### విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా

# నాణ్యమైన బోధన అందించాలి

### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులు ఉత్తమ విద్యా ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని, సులభంగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.గురువారం హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యా బోధన, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.విద్యార్థినులకు బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా అందిస్తున్న మైసూర్ బోండాను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. ప్రతిరోజూ అందిస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి, మెనూ గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి, ఆర్వో వాటర్ ప్లాంట్ పనితీరును తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందించే ఆహారం పరిశుభ్రంగా, పోషకాహార ప్రమాణాలతో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం**

అనంతరం ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సుల విద్యార్థినులతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో నేరుగా మాట్లాడారు. ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు ఫిజిక్స్ పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలను బోర్డుపై రాసి వాటిపై ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి, చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థినికి సులభంగా అర్థమయ్యే విధంగా అధ్యాపకులు పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన సాగించాలన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఫిజిక్స్ వాలా తరగతులను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అజ్మీర గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ కవిత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# అక్రమ బెల్ట్‌షాపులను మూసివేయాలి

ప్రజాపక్షం/బచ్చన్నపేట: మండలంలోని వివిధ గ్రామాలలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను వెంటనే మూసివేసి కల్తీ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు గంగం సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా నడుస్తున్న బెల్ట్‌షాపుల వల్ల కల్తీ మద్యం సులభంగా అందుబాటులోకి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం వల్ల ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కనకయ్య, రాజు, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ మిలీనియం క్లబ్‌కు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాపక్షం/జనగామ టౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం 25వ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. లయన్ బండ బిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సేవా కార్యక్రమాలలో లయన్స్‌క్లబ్ పాత్ర అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ క్లబ్ సేవలను కొనియాడుతూ సహకారం అందిస్తామన్నారు. అనంతరం లయన్ బాల్దె మల్లేశం అధ్యక్షునిగా, మేడ పూర్ణచందర్ ఉపాధ్యక్షులుగా, వెంకట్ ప్రసాద్ కార్యదర్శిగా, వెంకటేశ్వర్లు కోశాధికారిగా, మినుగొండ అశోక్ కుమార్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమంలో పూర్వ జిల్లా గవర్నర్లు లవకుమార్‌రెడ్డి, బన్నీ, పరువరాములు, బాధ్యులు రాజమౌళి, గౌతమ్ రెడ్డి, కిరణ్ కుమార్, యాదగిరి, నర్సిరెడ్డి, శ్రీరాం శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మామునూరు ఏయిర్ ఫోర్ట్‌పై కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు హాస్యాస్పదం

ప్రజాపక్షం/హనుమకొండ: మామునూరు ఎయిర్ పోర్టు పై కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం అని మాజీ చీఫ్ విప్, బిఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, నన్నపనేని నరేందర్ లు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత వరంగల్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు.మామునూరు ఎయిర్ పోర్టు నిజాం కాలంలో నిర్మించబడిందని అన్నారు. మామునూరు ఎయిర్ పోర్టు అభివృద్ధి కోసం మాజీ మంత్రి కేటీఆర్ అనేకసార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిశారు. ఉడాన్ పథకం సమయంలో కూడా కేంద్రంతో నిరంతరం చర్చలు జరిపిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ సంస్థతో కేటీఆర్ చర్చించి ముందుకు తీసుకెళ్లారని అన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేష్, టి. జనార్ధన్, ఎల్లావుల లలితా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



ప్రజాపక్షం/కమలాపూర్: ప్రకృతి వ్యవసాయం పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి వేణు రైతులకు సూచించారు. కమలాపూర్ మండలంలోని ఉప్పల్, భీంపల్లి గ్రామంలో నేషనల్ మిషన్ అండ్ నేచురల్ ఫామింగ్ పథకంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన మండలంలో ఉప్పల్, భీంపల్లి గ్రామాలు నేషనల్ మిషనరి నాచురల్ ఫామింగ్ పథకం కింద సెలెక్ట్ కావడం జరిగింది. దీంట్లో భాగంగా 125 మంది రైతులు ఈ పథకం కోసం సెలెక్ట్ అయ్యారని, కావున ఈ రైతులు వారి పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వ్యవసాయం చేయాలని, దానిలో ముఖ్యంగా బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం మొదలగు కషయాల యొక్క తయారీ విధానం వివరించడం జరిగిందని అన్నారు. దీంతో భూసారాన్ని పెంచడమే కాకుండా నీటి కాలుష్యాన్ని, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని అన్నారు. ప్రత్యామ్నాయ పంటలు అయిన మినుము, కంది, పెసర, మొదలగు అవసరాల పంటలు, నూనె గింజ పంటలను సాగు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ గ్రామ సర్పంచ్ ఎం. రమ నాగరాజు మాట్లాడుతూ.... ప్రకృతి వ్యవసాయంలో వ్యవసాయం చేసిన రైతుల యొక్క పంట గింజలను శాంపిల్ కు పంపించి ఒకవేళ అది ప్రకృతి వ్యవసాయ విధి విధానాలకు అనుకూలంగా చేయాలని, ప్రతి రైతు సోదరులు ప్రకృతి వ్యవసాయాన్ని ఫాలో అయితే మనం, మన ఊరు తద్వారా మన దేశం కూడా ఆరోగ్యంగా బాగుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మేడిపల్లి సిద్ధార్థ, మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాస్, సిఆర్‌పిలు అనురాగ్, రాము, ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 'సర్' ప్రక్రియలో ఓటర్లకు బిఆర్ఎస్ కార్యకర్తలు సహకరించాలి



ప్రజాపక్షం/వర్ధన్నపేట : ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లకు బిఆర్ఎస్ కార్యకర్తలు సహకరించాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ కోరారు. సత్యం గార్డెన్స్ లో గురువారం వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వర్ధన్నపేట మండలం, మున్సిపాలిటీ,ఐనవోలు మండల బిఎల్ఏలు, సభ్యత్వ నమోదు, సోషల్ మీడియా కార్యకర్తలతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ఫామ్స్ పూర్తి చేయడంలో ఓటర్లకు అందుబాటులో ఉండాలని బిఎల్ఏలకు సూచించారు. క్షేత్ర స్థాయిలో ఉంటూ ఓటర్లను కలిసి వారి సాయం అందించాలని అన్నారు. వీలైనంత తొందరగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసి ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా బీఎల్ఏ లు భాధ్యత తీసుకోవాలని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలని, బూత్ స్థాయి బీఎల్ఏ ల సమన్వయాన్ని బలోపేతం చేయాలని, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి అని వారు పిలుపునిచ్చారు.బిఆర్ఎస్ పార్టీ నుండి ప్రతి బూత్ కు ఇద్దరు బిఎల్ఏ లను కేటాయించడం జరిగిందని, వారు సమర్థవంతంగా ఎస్ఐఆర్, డిజిటల్ సభ్యత్వ నమోదు ప్రక్రియను బీఎల్ఓల వెంట ఉండి ఓటరు జాబితా ప్రక్రియను సమర్థవంతంగా పునరుద్ధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు ఇంచార్జ్ మసూద్, మాజీ జడ్పీ వైస్ గజ్జల శ్రీరాములు, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, కౌన్సిలర్స్ సీల్వేరు కుమారస్వామి, సురేష్, మాజీ సర్పంచ్ సురేష్, సుధాకర్ గార్లు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వల్భాపూర్‌లో ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన



ప్రజాపక్షం/ఎల్కతుర్తి : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్భాపూర్ గ్రామంలో ఎల్కతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో గురువారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ఎల్కతుర్తి పీహెచ్‌సీని లేదా ఆశా కార్యకర్తలను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్వేత, ఉపసర్పంచ్ అనిల్, వార్డు సభ్యులు,ఎఎన్ఎం మమత, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆరోగ్య శిబిరాన్ని విజయవంతం చేసిన వైద్య సిబ్బందిని గ్రామ ప్రజలు అభినందించారు.

# వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : హంటర్ రోడ్ లోని మాస్టర్ జీ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్ అట్టహాసంగా జరిగింది. కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ ఎస్. సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్ నిర్వహించారు. పలువురు సామాజికవేత్తలు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అన్ని వర్గాల ప్రముఖుల చేతుల మీదుగా విద్యార్థుల కేరింతల నడుమ ట్రైలర్, సాంగ్స్ రిలీజ్ చేశారు. వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం జానకిపురం గ్రామానికి చెందిన ఆడబిడ్డ కోమలి మహేందర్ సాహసోపేతంగా ధైర్యం చేసి కుటుంబ నేపధ్యమున్న సినిమా తీయడంతో వారిని శాలువతో సుందర్ రాజ్ యాదవ్ సన్మానించి అభినందనలు తెలిపారు. ట్రైలర్, సాంగ్స్ రిలీజ్ చేసిన అనంతరం మాజీ కుడా చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్,వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ నిర్మాత కోమలి మహేందర్ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాస్టర్ జీ డిగ్రీ, పీజీ కళాశాల జనరల్ సెక్రెటరీ అచ్యుత్ రాజ్,ఓబిసి ప్రధాన కార్యదర్శి, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, ప్రైవేట్ లెక్చరర్స్ ఫోరమ్ అధ్యక్షుడు గంగాపురం వేణు మాధవ్ గౌడ్, ఓబిసి సభ్యురాలు చిగుమల్ల మౌనిక, ప్రముఖ అడ్వకేట్ బండా వివేకానంద, పారిశ్రామికవేత్త గుండా శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది: కలెక్టర్

ప్రజాపక్షం/జనగామ: ప్రజావాణిలో అందిన ప్రతి ఆర్జీని సానుభూతితో పరిశీలించి అర్హులైన బాధితులకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో అందే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం కష్టపడ పని చేస్తోందన్నారు. అనుకోని ప్రమాదాలతో జీవనాధారం కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు.

# మద్దులపల్లిలో 'సర్' ప్రక్రియ పూర్తి చేసిన బిఎల్‌ఒకు సన్మానం

ప్రజాపక్షం/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మద్దులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా 100 శాతం సర్ నమోదు ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావడంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం బిఎల్ఓ మొండయ్యను స్థానిక సర్పంచ్ ఎల్పుల సరిత ఘనంగా సన్మానించారు.గ్రామంలోని 165వ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న 536 మంది ఓటర్ల నమోదు ప్రక్రియను 100 శాతం గడువు కంటే ముందే పూర్తి చేసిన బిఎల్ఓ మొండయ్యను సర్పంచ్ సరిత శాలువాతో సత్కరించి అభినందలు తెలిపారు.మండలంలోనే 'సర్' ప్రక్రయ పూర్తి స్థాయిలో పూర్తి చేసిన గ్రామంగా మద్దులపల్లి నిలిచిందని అధికారులు గుర్తించినట్లు సర్పంచ్ తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ సరిత మాట్లాడుతూ...ఎన్నికల కమీషన్ నిర్దేశించిన లక్ష్యాని కంటే ముందే పూర్తి చెసిన బిఎల్ఓ మొండయ్య కృషి అభినందనీయమని పేర్కొన్నారు.గ్రామ ప్రజలు,ఎన్నికల సిబ్బంది సహకారంతోనే ఈ ఘనత సాధ్యమైందని ఆమె అన్నారు.అధికారులు కూడా బిఎల్ఓ సేవలను ప్రశంసించినట్లు ఆమె తెలిపారు.

# కాంగ్రెస్‌కి పెద్ది రాకతో టపాసులు పేల్చి సంబరాలు



ప్రజాపక్షం/దేవరుప్పల: గాంధీ భవన్‌లో పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డితో దేవరుప్పల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు , దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తిగౌడ్ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిశారు.ఈ సందర్భంగా ఆయన కృష్ణమూర్తి సస్పెన్షన్‌ను ఎత్తివేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానించారు. అందులో భాగంగానే మండల కేంద్రంలోని జనగామ సూర్యాపేట ప్రధాన రహదారి చౌరస్తాలో పెద్ది వర్గం శ్రేణులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

# దేవాదుల ప్రాజెక్టు ద్వారా గణపసముద్రం చెరువును నింపాలి

ప్రజాపక్షం/భూపాలపల్లి/గణపురం:దేవాదుల కాంతనపల్లి ప్రాజెక్టు ద్వారా రామప్ప చెరువు నుండి గణపసముద్రం చెరువు లో నీటితో నింపాలని, తాగు,సాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అధికారులను కోరారు. భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలంలోని గణపచెరువును, రామప్ప చెరువును సందర్శించి అక్కడ నీటిమట్టాన్ని నియోజకవర్గ బిఆర్ఎస్ నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామప్ప నుండి గణపురం చెరువుకు వెళ్లే గ్రామం కెనాల్, రామప్ప నుండి పాకాల వెళ్లే పంప్ హౌస్ లను పరిశీలించారు. గణపురం మండలంలోని కాకతీయులకాలం నాటి పురాతనమైనది ఈ గణపురం చెరువును నింపాలని, ఈ గణపురం చెరువులో నీళ్ళు ఉంటే గణపురం మండలమే కాకుండా భూపాలపల్లి, చిట్యాల, మొరంచవాగు ద్వారా ఆయా మండలాల ఆయకట్టులో రైతులు రెండు పంటలు పండిస్తారని చెప్పారు. కాబట్టి రామప్ప ఫుల్ లెవెల్ వాటర్ మెంటైన్ చేస్తూ అక్కడి నుండి గ్రావిటీ కెనాల్ ద్వారా ఘనపురం చెరువుకు నీటిని పంపు చేసి చెరువు యొక్క ఫుల్ లెవెల్ మెంటైన్ చేస్తూ తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను, ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## భారతరత్న అంబేద్కర్ భావజాల వ్యాప్తి జరగాలి

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** సమాజ అభివృద్ధి కోసం, అణగారిన వర్గాల సంక్షేమం భారత రత్న డాక్టర్ అంబేద్కర్ భావజాల వ్యాప్తితోనే జరుగుతుందని ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ అంబేద్కర్ సెంటర్ జాయింట్ డైరెక్టర్ గా డాక్టర్ పుల్లా శ్రీనివాస్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ శ్రేణులు, దళిత వర్గాల నేతృత్వంలో కేయూ గ్రంథాలయం నుంచి అంబేద్కర్ స్టడీ సెంటర్ వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ పుల్లా శ్రీనివాస్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని కేయూ రిజిస్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్ర నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ నేతృత్వంలో అంబేద్కర్ సెంటర్ అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. అంబేద్కర్ భావజాలాన్ని, అంబేద్కర్ సిద్ధాంతాలను సమాజంలో అన్ని వర్గాలకు చేరవేసి సమాజ ఉన్నతిని పాటుపడాలని కోరారు. బహుజనులకు అంబేద్కర్ సెంటర్ విజ్ఞానాన్ని పంచాలని, అండగా నిలవాలని తెలిపారు. జాయింట్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పుల్ల శ్రీనివాస్‌ను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డి ప్రొఫెసర్ బైరు వెంకటరామిరెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి. సురేష్ లాల్, డాక్టర్ చిర్రా రాజు గౌడ్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్.రమణ, ప్రొఫెసర్ కే. బిక్షాలు, పలు విభాగాల అధిపతులు ప్రొఫెసర్ ఏం స్వర్ణలత, ప్రొఫెసర్ ఎల్పీ రాజకుమార్, డాక్టర్ బి.ఎస్.ఎల్ సౌజన్య, డాక్టర్ తాడూరి శాస్త్రి, ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ గడ్డం కృష్ణయ్య, స్టూడెంట్స్ యూనియన్ నాయకులు బొచ్చు తిరుపతి, మంద నరేష్, మంద భాస్కర్, బొట్ల మనోహర్, డాక్టర్ గుండేటి సుమన్, కలకోట సుమన్, పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశం

**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండల కేంద్రం లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కన్వీనర్ గాదె శ్రీనివాస చారీ అధ్యక్షతన సమావేశం ఘనంగా ఏర్పాటు చేయగా ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ తీసుకున్న ప్రధాన తీర్మానాలు సంతాప తీర్మానం మంగపేట మండల సీనియర్ ఉద్యమకారుడు రాజపేట గ్రామానికి చెందిన స్వర్గీయ మలికంటి శంకర్ అకాల మరణానికి సంతాపం తెలిపారు. వారి ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించి వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు. ఉద్యమకారుల జాబితా మండలంలోని ఉద్యమకారులందరూ తమ వివరాలతో కూడిన బయోడేటాను ఈ నెల 25వ తేదీలోపు కమిటీకి సమర్పించాలని నిర్ణయించారు. అమరవీరుల స్థూపం మంగపేటలోని అమరవీరుల స్థూపాన్ని పునర్నిర్మించాలని తీర్మానించారు. ఈ నిర్మాణానికి అన్ని రాజకీయ పక్షాలు కుల సంఘాలు అన్ని వర్గాల ప్రజల సహకారం తీసుకోవడానికి కన్వీనర్ తో పాటు మరో ముగ్గురికి బాధ్యతలు అప్పగించారు. ఉద్యమకారులకు గుర్తింపు రాబోయే ప్రజా ఎన్నికల్లో ఉద్యమకారులకు తగిన గుర్తింపు పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పప్పు వెంకటరెడ్డి, కొమరగిరి కేశవరావు, చిలకమర్రి రాజేందర్, గూడ వాసుదేవమూర్తి, నూనె లింగయ్య కుంట ఏడుకొండలు కాటూరి సుగుణ, బీసు సాంబయ్య పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్ఠంగా జరగాలి



**ప్రజాపక్షం/హనుమకొండ:** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ వరంగల్ నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని, నగర పరిశుభ్రతలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి ఆదేశించారు.గురువారం హనుమకొండ కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల వసూళ్లు, బయోమెట్రిక్ హాజరు, ప్లాస్టిక్ నియంత్రణ, వర్షాకాల సన్నద్ధత తదితర అంశాలపై డివిజన్ల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

**వర్షాకాల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి**

వర్షాకాలంలో మురుగునీరు నిల్వ కాకుండా నగరంలోని అన్ని అంతర్గత మురుగుకాలువల్లో 100 శాతం డీ సిల్టింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని, అవసరమైన చోట యంత్రాలతో పాటు గ్యాంగ్‌మెన్‌లను వినియోగించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.నగరంలో ప్రతిరోజూ కనీసం 400 టన్నుల ఘన వ్యర్థాల సేకరణ జరిగేలా శానిటరీ సూపర్వైజర్లు, జవాన్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అన్ని పారిశుధ్య వాహనాలు, కంటైనర్లు, ట్రాక్టర్లు ఎల్లప్పుడూ పనిచేసే స్థితిలో ఉండేలా చూడాలని, మరమ్మతులు అవసరమైతే వెంటనే పూర్తి చేసి పారిశుధ్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, ఆస్కి ప్రతినిధి రాజమోహన్, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి ప్రత్యేక పూజా కార్యక్రమాల కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఈ నెల 29వ తేదీ బుధవారం జరగనున్న గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాన్ని గురువారం స్థానిక శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో ఆలయ చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు వెయ్యిగండ్ల రమేష్, నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ మాట్లాడుతూ, గురు పౌర్ణమి రోజున నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయి బాబా అనుగ్రహాన్ని పొందాలని కోరారు. మధ్యాహ్నం నిర్వహించే మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని బాబా ప్రసాదాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉదయం మాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేయించుకోవాలనుకునే భక్తులు ముందస్తుగా ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.ఆలయ ధర్మకర్త, పీఆర్వో నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ, గురు పౌర్ణమి దర్శనానికి విచ్చేసే భక్తులు ఓపికతో సిబ్బంది సూచనలు పాటిస్తూ దర్శనం చేసుకుని, నిర్వహించే పూజా కార్యక్రమాలలో భక్తిశ్రద్ధలతో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి చందు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు గురు పౌర్ణమి ప్రత్యేక పూజా కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు.

## 19న దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ రాష్ట్రస్థాయి సమావేశం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హన్మకొండలోని పబ్లిక్ గార్డెన్ లో దివ్యాంగుల ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు బిల్లా మహేందర్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ ఈ నెల 19న ఆదివారం హైదరాబాద్‌లోని ప్రకాశం హాల్‌లో డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం జరుగబోతున్నదని, ఈ సమావేశంలో దివ్యాంగ ఉద్యోగుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన అత్యంత కీలకమైన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళేలా ప్రయత్నం జరుగుతున్నదని, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇహెచ్ఎస్ కు సంబంధించిన విధి విధానాలను రూపొందిస్తున్న నేపథ్యంలో 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం దివ్యాంగ ఉద్యోగులకు ప్రీమియం చెల్లింపుల నుంచి పూర్తిగా మినహాయింపు కల్పించేలా ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంత చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఆయా జిల్లా బాధ్యులు మల్సూర్, బోనగిరి రాములు, ఆకవరపు స్వరూప, బొప్పి ఉమారాణి, రవీందర్, పెండ్యాల రాధిక, సులోచన, డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, ప్రభాకర్, గంధం సంతోష్, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

**ప్రజాపక్షం/హనుమకొండ:** క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, పట్టుదలతో విజయం కోసం శక్తివంచన లేకుండా పోరాడిన వారికే విజయం సొంతమవుతుందని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ వి. తిరుపతి రెడ్డి అన్నారు.హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ట్రాన్స్‌కో, టీజీఎన్పీడీసీఎల్ , టీజీఎస్పీడీసీఎల్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 2026–27 సంవత్సరానికి సంబంధించిన ఇంటర్ సర్కిల్ వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ , క్యారమ్ క్రీడా పోటీలను ముఖ్య అతిథిగా విచ్చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఫైనాన్స్ వి. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తున్నారని అన్నారు . ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని అలవరచుకొని, క్రమశిక్షణతో, అంకితభావంతో పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని, అదే నిజమైన క్రీడాస్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం, పట్టుదల, జట్టు భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.విధి నిర్వహణలో ఎంత నిబద్ధతతో పనిచేస్తామో, అదే ఉత్సాహంతో క్రీడల్లోనూ పాల్గొనడం ఉద్యోగుల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ రాజు చౌహన్ , సీజియం వేణు బాబు , ప్రెసిడెంట్ స్పోర్ట్స్ కౌన్సిల్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆపరేషన్ హనుమకొండ బి. సామ్య నాయక్ , స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు ఎ. ఆనందం ఎస్ఈ వరంగల్, సి.హెచ్ . సంపత్ రెడ్డి ఎస్ఈ, జనగామ, ప్రేమ్ కుమార్ మెంబర్లు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే రేవూరి

**ప్రజాపక్షం/నడికూడ :** నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భైరపాక భద్రయ్యసుమలత దంపతుల కుమార్తె చిన్నారి త్రివేణి నూతన వస్త్ర ఫలంకరణ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని దీవించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోంగంటి తిరుపతి, మండల అధ్యక్షులు పర్నెం మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర దేవేందర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల చిన్ని, సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ పాలకవర్గం, గ్రామ, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రణయ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే రేవూరి

**ప్రజాపక్షం/నడికూడ :** నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామ వాస్తవ్యులు కంటాత్మకూర్ ప్రణయ్ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందాగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రణయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులను ఓదార్చి,ఆర్థిక సాయం అందించారు.ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని,ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయం అందిస్తామని ఎమ్మెల్యే వారికి భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్,ఉపసర్పంచ్,వార్డ్ మెంబర్లు,మండల కాంగ్రెస్ నాయకులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించాలి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు మండలంలోని కడవెండి గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఏ ఒక్క అర్హులైన ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా ఉండేలా బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, పార్టీ శ్రేణులు, గ్రామ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా బీఆర్ఎస్ నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి సూచించారు. గ్రామంలోని ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా ఉండేలా పార్టీ నాయకులు, బూత్ కమిటి సభ్యులు, గ్రామ ఇంచార్జీలు, యువజన నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు అందరు సమిష్టిగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్వ మల్లేశం, రాంసింగ్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు మహేష్, జేరిపోతుల సాయిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మూగ జీవాల మందులు మట్టిపాలు చేస్తున్న అధికారులు

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండల కేంద్రంలో ఉన్నటువంటి పశువైద్యశాల పశువులకు శాపంగా మరిందని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్, రైతు సంఘం మండల అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్నటువంటి పశువుల ఆసుపత్రిలో మందులు ఎక్స్‌పైర్ డేట్ అయిపోయిందనే పేరుతో మొత్తంగా లక్షల రూపాయల మందుల బస్తాలను బస్తాలలో నింపి మట్టిపాలు చేస్తున్నారన్నారు. ఒక వైపు మందుల కొరత ఉంటే మందులు మొత్తం మట్టిపాలు చేయడం డాక్టర్ అసమర్థతనే అని హెచ్చరించారు. తక్షణమే వైద్యునిపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. లేదంటే ఆసుపత్రి ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ఉద్యాన పంటలకు భారీ రాయితీలు

**ప్రజాపక్షం/జనగామ:** జిల్లాలో ఉద్యానవన పంటల విస్తరణకు ప్రభుత్వం పలు పథకాల కింద భారీ రాయితీలు అందిస్తున్న జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్, ఎఐడీహెచ్, ఆయిల్ ఫామ్, శ్వాత పందిరి, మల్బరీ సాగు, తదితర పతకాల ద్వారా రైతులకు 50శాతం నుంచి 90శాతం వరకు సబ్సిడీ లభించనుంది. డ్రిప్ ఇరిగేషన్‌కు 2వేల ఎకరాలు, ఆయిల్ ఫామ్‌కు 2వేల ఎకరాలకు, ఉద్యాన పంటల అభివృద్ధికి 659.49 హెక్టార్లు, మల్బరీ సాగుకు 40 హెక్టార్లు లక్ష్యంగా నిర్ణయించారు. ఆసక్తి గల రైతులు ఆదార్, పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంకు ఖాతా వివరాలతో సమీప ఉద్యానవన అధికారులు లేదా మీ సేవ కేంద్రాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# ఏటూరునాగారంలో అభివృద్ధి శూన్యం



**ప్రజాపక్షం/ములుగుః** ఏటూరునాగారం మండలంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని బిజెపి ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం విమర్శించారు. మండల కేంద్రంలో బిజెపి మండలాధ్యక్షుడు వినుకొల్లు చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలైన మహిళలకు తులం బంగారం, నెలకు రూ. 2500 ఆర్థికసాయం, వడ్డీలేని రుణాలు, ఎస్సిలకు ప్రకటించిన పథకాలు, రైతు రుణమాఫీ, పోడు భూముల పట్టాలు, గోదావరి కరకట్ట తూముల మరమ్మత్తులు, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు వంటి హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసం చేశాయని, తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే అవినీతిపై చర్యలు తీసుకొని ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమన్వయంలో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూక్య జోహార్ ఆల్, మండల ఇన్‌చార్జి సుధాకర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జాడి రామరాజు నేత, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్ధన్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కుర్ర సుమలత, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు దడిగ వెంకటేశ్వర్లు, పార్టీ జిల్ల, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో కొనసాగాలని పెద్ది కృష్ణమూర్తికి ఆహ్వానం

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** రెండేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెన్షన్‌కు గురైన దేవరుప్పుల సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్‌ను తిరిగి పార్టీలో చేరాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆహ్వానించారు. గురువారం గాంధీ భవన్‌లో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డితో కలిసి ఆయనను కలిసిన సందర్భంగా సస్పెన్షన్‌ను ఎత్తివేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పెద్ది కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ తనను నమ్మి సర్పంచ్‌గా గెలిపించిన గ్రామ ప్రజలు, కార్యకర్తల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ బడుగు, బలహీన వర్గాల సేవకు కట్టుబడి ఉంటానన్నారు.

# కందుల సాగర్‌ను పరామర్శించిన పల్లా సుందర్ రాంరెడ్డి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన కందుల సాగర్ ఇటీవల తాటిచెట్టుపై నుండి కిందపడడంతో గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా బీఆర్ఎస్ నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. సాగర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# మల్లూరు హేమచల ఆలయం అభివృద్ధి పై సమీక్షా

**ప్రజాపక్షం/మంగపేట :** ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామంలో క్రీస్తు శకం ఆరవ దశబ్దంలో స్వయంభుగా వెలసిన హేమాచల శ్రీ లక్ష్మి నృరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధి పనుల కోసం అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ గ్రామీణ మంచినీటి సరఫరాల శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క హాజరవ్వగా దేవస్థాన ఈవో వీరాస్వామి తో పాటుగా ఆలయ అర్చక సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామి వారి దర్శనం అనంతరం వారి చరిత్ర ను విశిష్టతను వివరించి శేష వస్త్రమును అందజేసిన అర్చక సిబ్బంది. స్వామి వారి దర్శనం అనంతరం తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి హేమచల కొండల్లో వెలసిన మల్లూరు హేమచల శ్రీ లక్ష్మి నృసింహా ఆలయం అభివృద్ధి కి ప్రభుత్వానికి 17 కోట్ల రూపాయల ఎస్టిమేషన్ పంపిస్తే



ప్రాథమికంగా మండపానికి 3 కోట్లు రూపాయల కేటాయించారు మిగతా రూపాయలు విడతల వారీగా విడుదల చేస్తామని స్వామి వారి మండపం విషయంలో సమిష్టిగా అందరు అధికారులు కలిసి సమన్వయంతో ఎస్టిమేషన్లను పనులను త్వరత్వరగా పూర్తిచేయాలని, మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు, జిల్లా ఎస్పీ సుధీర్, రామ్నాథ్, ఎంపిడిఓ భద్రునాయక్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క పర్యటన వేళ కాంగ్రెస్‌కు షాక్

**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండలంలోని బండారి గూడెం గ్రామంలో గురువారం జరిగిన రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి మండలంలో మంత్రి సీతక్క పర్యటన కొనసాగుతున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న మోసపూరిత విధానాలకు నిరసనగా ఆ పార్టీకి చెందిన పలువురు యువ నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. బిఆర్ఎస్ పార్టీ యువజన సీనియర్ నాయకులు బాడిషా నాగ రమేష్ ఆధ్వర్యంలో చేరికల కార్యక్రమంలో జరిగింది. ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీలో చేరిన వారందరికీ ఆయన స్వయంగా గులాబీ కండువాలు కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్లు పంపిణీలో జరుగుతున్న పక్షపాతం, అమలు కాని హామీలతో ప్రజలను వంచిస్తున్న తీరును వారు తీవ్రంగా ఖండించారు. కాకు



లమర్రి లక్ష్మణ్ బాబు, సమర్థ నాయకత్వం బిఆర్ఎస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజాహిత విధానాల పట్ల నమ్మకంతోనే తాము పార్టీలో చేరామని వారు స్పష్టం చేశారు. ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ, మీ గ్రామానికి చెందిన ఏ సమస్య అయినా నేను ఏ పనైనా మీ అందరికీ అందుబాటులో ఉండి మీ సమస్యను పరిష్కరించి మీ తోడుగా వెన్నంటే ఉంటానని, సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాటి కృష్ణ, కొమరం ధనలక్ష్మి, తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు, కునూరు అశోక్ గౌడ్, ఎడ్లపల్లి నరసింహారావు, సున్నం నిర్మల్, యడం నితిన్, యడం అరవింద్, కురుసం సంతోష్, పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సూచిక బోర్డుల ఏర్పాటు

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు ఆధ్వర్యంలో గురువారం సూచిక బోర్డులను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా మండలంలోని బొమ్మాపూర్ నుండి పలిమెలకు వెళ్లే ప్రధాన రహదారిపై మూల మలుపులు,ప్రమాదాలకు ఆస్కారముండే ప్రాంతాల్లో హెచ్చరిక చేస్తూ సూచిక బోర్డులను ఏర్పాటు చేసారు.అనంతరం ఎస్సై సాంబమూర్తి మాట్లాడుతూ సూచిక బోర్డుల ఏర్పాటుతో వాహనదారులు వేగాన్ని నియంత్రించడం,మూలమలుపుల వద్ద అప్రమత్తంగా ప్రయాణించడం,రాత్రి వేళల్లో రిఫ్లెక్టివ్ బోర్డులను గుర్తించి సురక్షితంగా ప్రయాణించడం తో ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు.వాహనదారులు రహదారి నిబందనలను పాటిస్తూ సురక్షితంగా ఇంటికి చేరడంతో కుటుంబం సురక్షితంగా ఉంటుం




దని అన్నారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని,నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు వాడాలని,వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించరాదని సూచించారు.రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాని ప్రయాణంలో నిరర్లక్ష్యం తగదని అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సింగరేణి భరోసా యాత్రపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా॥ చందుపట్ల కీర్తి రెడ్డి విమర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని బీఎంఎస్ కార్యాలయంలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు అప్పాని శ్రీనివాస్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా॥ చందుపట్ల కీర్తి రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డా॥ చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సింగరేణి భరోసా యాత్రపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి సంస్థను దాదాపు దివాలా తీసే పరిస్థితికి నెట్టారని ఆరోపించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించిన తాడిచెర్ల1 బొగ్గు బ్లాక్‌ను తిరస్కరించేలా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందన్నారు. అనంతరం ఆ బ్లాక్‌ను జెన్‌కోకు కేటాయించిన తర్వాత ప్రైవేట్ సంస్థ ఏఎమ్ఆర్ అప్పగించి, మార్కెట్ విలువ కంటే అధిక ధరకు బొగ్గు కొనుగోలు చేసేలా ఒప్పందాలు చేసుకుని సింగరేణికి భారీ నష్టం కలిగించారని విమర్శించారు. అధికారంలో నుంచి దిగే సమయానికి సింగరేణిపై దాదాపు రూ.30 వేల కోట్ల అప్పుల భారం మోపి ఆర్థికంగా బలహీనపరిచిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ సమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు అప్పాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరుకల గణపతి,సెంట్రల్ కార్యదర్శి సట్కూరి శ్రీనివాస్, బ్రాంచి కార్యదర్శి రాసకట్ల నర్సింగరావు, శ్రీనివాస్, తిరుపతి, కొమరన్న, బీఎంఎస్ నాయకులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** బచ్చన్నపేట గ్రామంలోని దొంతుల సోమలింగం ఇంట్లో జరిగిన చోరీ కేసును చేధించిన జనగామ పోలీసులు ఏసీబీ బీమ్ శర్మ తెలిపిన వివరాల ప్రకారం నిందితుల నుండి 8 తులాల బంగారం, 1475 గ్రాముల వెండి, 3 మోటార్ సైకిళ్లు, 15వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రధాన నిందితుని తోపాటు మరో ఇద్దరు జువైనల్స్‌ను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ప్రధాన నిందితునిపై ఇప్పటికేస సుమారు 40 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయన్నారు. జైలు నుండి విడుదలైన తర్వాత ఇద్దరు జువైనల్స్‌ను ప్రలోభపెట్టి చోరీలకు పాల్పడుతున్నారని దర్యాప్తులో తేలిందన్నారు.

# స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** మహిళా సంఘాల సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా సమాఖ్య సభ్యులు, గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార, పశు సంవర్ధక, మున్సిపల్, పంచాయతీ శాఖ, మెప్మా, సెర్ప్ అధికారులు, కోఆర్డినేటర్లు, ఏపీఎంలతో జిల్లా స్థాయి స్త్రీ నిధి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులకు స్త్రీ నిధి రుణాల వల్ల కలిగే ప్రయోజనాలు, మన స్త్రీ నిధి యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ నిధి ద్వారా మహిళలకు వివిధ ఉపాధి అవకాశాల కోసం రుణాలు అందిస్తోందని, ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి స్త్రీ నిధి కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. స్త్రీ నిధి రుణాల మంజూరులో జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో ఉందని పేర్కొన్నారు. అయితే మహాముత్తారం, పలిమెల మండలాల్లో రుణాల వినియోగదారులు తక్కువగా ఉన్నారని, ఆ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన మహిళలకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ రికవరీలను త్వరితగతిన పూర్తి చేసి కొత్త రుణాల మంజూరుకు అవకాశం కల్పించాలని అన్నారు. రుణాల రికవరీలో జిల్లా ప్రస్తుతం 19వ స్థానంలో ఉందని, ఈ ర్యాంకును మెరుగుపర్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని మహిళా శక్తి క్యాంటిన్ల నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణ, సహకార అధికారి వాల్యా నాయక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మెప్మా పిడి రాజేశ్వరి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, సెర్ప్, మెప్మా అధికారులు ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# మినీ గురుకులంలో ఎంపిడిఒ కృపాకర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రం లోని మినీ గురుకుల పాఠశాలను గురువారం ఎంపీడీవో కృపాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ఆహార నిల్వ గది, వంటశాల, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, మందులు లభ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికార్డులు నిర్వహిస్తూ, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రధానోపాధ్యాయురాలు సుజాత ఎంపీడీవో కృపాకర్ సూచించారు.

# గిరిజనేతర అక్రమ పట్టాలను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/వాజేడు:** గిరిజనుల సాగు భూములపై అక్రమంగా పట్టాలు పొందిన గిరిజనేతరుల పట్టాలను వెంటనే రద్దు చేసి, సాగులో ఉన్న గిరిజనులకు భూములను అప్పగించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వందేళ్లుగా గిరిజనులు సాగు చేస్తున్న భూములను వలస గిరిజనేతరుడు అక్రమంగా పట్టాలు పొంది దున్నాడని ఆరోపిస్తూ, సంబంధిత వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఎల్‌టీఆర్ చట్టాల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు దామోదర్, దేవయ్య, కృష్ణబాబు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిరాహార దీక్షకు కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గం

నిరసనకారులతో వెంటనే చర్చలు జరపాలి

**ప్రజాపక్షం/వరంగల్ :** లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు నిరసనగా, పరీక్షా పత్రాల లీకేజీ పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని జంతర్ మంతర్ వద్ద ప్రముఖ సామాజిక పర్యావరణ కార్యకర్త సోనం వాంగ్ చుక్ 19 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. నీట్ పరీక్షల నిర్వహణలో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 20 నుండి కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతుండగా, జూన్ 28 నుండి సోనమ్ వాంగ్ చుంగ్ నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించి 19 రోజులు కావస్తున్న ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. రోజు రోజుకి ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తూ బలహీనపడి ప్రాణానికి ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు. పార్లమెంటుకు కూతవేటు దూరంలో ఉన్న జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఉద్యమకారులతో చర్చలు జరపడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడం సిగ్గుచేటన్నారు. 2011లో అన్నా హజారే నిరవధిక నిరాహార దీక్ష చేస్తే 13 రోజులకే ఆనాటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ స్పందించి లోక్‌పాల్ బిల్లు ఏర్పాటుకు అంగీకరించి నిరవధిక నిరాహార దీక్షను విరమింప చేయించడం జరిగిందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్రను వీడనాడి నిరసన కారులతో చర్చలు జరిపి వాంగ్ చుక్ నిరాహార దీక్ష విరమింపజేసి ప్రాణాలను కాపాడాలన్నారు. ఆయన ప్రాణానికి ఎలాంటి ప్రమాదం జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, అన్ని వర్గాల ప్రజలు వాంగ్ చుక్ నిరవధిక నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు, సంఘీ భావాన్ని ప్రకటించాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు

## ఉరివేసుకుని ఆటో డ్రైవర్ ఆత్మహత్య



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** జాతీయరహదారి 365 శనిగరం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరెసుకోని ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది . గురువారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని శనిగరం గ్రామ జాతీయరహదారి పక్కన చెట్టుకు ఖానపూరం మండలంలోని అయోధ్యనగర్‌కు చెందిన పుప్పాల దేవేందర్ (35) ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రత్యసాక్షులు తెలిపారు . సమాచారం తెలుసుకున్న నల్లబెల్లి ఎస్ఐ ఎ.సాయిప్రసన్నకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని శవ పంచానామ నిర్వహించారు .మృతుడు దేవేందర్ రోజు వారిగా కూలీలను ములు గు రామచంద్రపురం గ్రామానికి తీసుకెళ్లవారని ఉదయం కూలీలను రామచంద్రపు రం దించి సాయంత్రం తీసుకు వెళ్లె క్రమ ంలో ఆత్మహత్య చేసుకున్నాట్లు ప్రత్య క్ష సాక్షులు తెలిపారు. వెంటనే పోలీసు పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట మార్చురికి తరలించారు.

## చంద్రశేఖర్ వర్ధంతి

**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట పట్టణంలో కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ రెండవ వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు మాట్లాడుతూ తనకోసం తన పని చేసుకోవడమే కాదు సమాజంలో బడుగు బలహీన వర్గాల కొరకు నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ అని తనకోసం తన పని చేయడం కాదు సమాజం మార్పు కొరకు పని చేసిన వ్యక్తి మహా గొప్ప వ్యక్తి అని కొనియాడారు. పోడు భూముల సమస్య పరిష్కరించాలని గిరిజన గ్రామాలు తిరుగుతూ గిరిజనులు ఏకం చేసి భూ పోరాటాలు నడిపిన వ్యక్తని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కావాలని స్వామినాథ సిపార్సులు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టియాసిఐ జిల్లా నాయకులు బానోతు జవహర్ లాల్, పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి అలువాల నరేష్, ఎండి కలీల్, ఎస్కె రంజాన్, బాలరాజు, రాజేందర్, రవి పాల్గొన్నారు.

# చెరువులను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

తాగునీటికి, వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా చూడాలి

**ప్రజాపక్షం/గణపురం:** భూపాలపల్లి నియోజకవర్గం గణపుర మండలంలోని గణపసముద్రం చెరువును, రామప్ప చెరువును భూపాలపల్లి మాజీ ఎంఎల్ఏ గండ్ర వెంకటరమణారెడ్డి నియోజకవర్గ బిఆర్ఎస్ నేతలతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఏ రామప్ప నుండి గణపురం చెరువుకు వెళ్లే గ్రావిటీ కెనాల్, రామప్ప నుండి పాకాల వెళ్లే పంప్ హౌస్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణపురం మండలంలోని కాకతీయుల కాలం నాటి పురాతనమైందని ఈ గణపసముద్రం చెరువు అన్నారు. ఈ చెరువులో నీళ్ల ఉంటే గణపురం మండలమే కాకుండా భూపాలపల్లి, చిట్యాల, మొరంచవాగు ద్వారా ఆయా మండలాల ఆయకట్టులో రైతులు రెండు పంటలు పండిస్తారు. ఈ రోజు ఈ చెరువులో నీటిని చూస్తే 15అడుగు మేర నీరు ఉంది. వర్షాభావ పరిస్థితులు చూస్తుంటే నిరాశజనకంగా ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితి రాకూడదని కెసిఆర్ ఈ చెరువును నింపాలనే ఉద్దేశ్యంతో దేవాదుల పథకం ద్వారా రామప్ప నుండి గణపురం చెరువుకు గ్రావిటి కెనాల్ నిర్మించడం కొరకు నిధులు మంజూరు చేసి, టెండర్ పిలవడం జరిగిందని, తర్వాత జరిగిన పరిణామాల్లో బిఆర్ఎస్ పార్టీ ఓటమి చెందడంతో నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కెనాల్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. అదే విధంగా నేడు గణపురం మండలంతో పాటు భూపాలపల్లి, చిట్యాల, రేగొండ, గోరికొత్తపల్లి మండల ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా మంచి నీటిని కూడా ఇక్కడి నుండే అందిస్తున్నాం. కానీ నేడు ఈ చెరువు యొక్క నీటి మట్టం తక్కువగా ఉండడంతో తాగునీటికి ఇబ్బంది కలుగుతుంది. రెండు రోజుల క్రితమే దేవాదుల నుండి రామప్పకు నీటిని పంపిస్తున్నారని, కాబట్టి రామప్ప ఫుల్ లెవెల్ వాటర్ మైంటైన్ చేస్తూ అక్కడి నుండి గ్రావిటీ కెనాల్ ద్వారా గణపురం చెరువుకు నీటిని పంపు చేసి చెరువు యొక్క ఫుల్ లెవెల్ మైంటైన్ చేస్తూ తాగునీటికి, సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# చేతిలో ఫోన్ ఉందని....చేతికి వచ్చినట్లు కామెంట్లు!

బిఎల్ఓల శ్రమను గుర్తించని సోషల్ మీడియా పోస్టులపై అసంతృప్తి

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా బిఎల్ ఓలు క్షేత్రస్థాయిలో పడుతున్న శ్రమను పక్కనపెట్టి, సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న విమర్శలు సరివని కావని పలువురు బిఎల్ఓలు, ఎన్నికల సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని 39 గ్రామ పంచాయతీల పరిధిలో 54 మంది బిఎల్ఓలు ఇంటింటికి వెళ్ళి దరఖాస్తు ఫారాలు అందజేస్తూ, ఓటర్ల వివరాల సేకరణ చేపడుతున్నారు. అయితే చాలా మంది ఇళ్లకు తాళాలు వేసి ఉండడం, కొందరు ఉపాధి కోసం బయటకు వెళ్ళడం, మరికొందరు స్పందించకపోవడం వలన ప్రక్రి య ఆలస్యమవుతోందని వారు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బిఎల్ఓలు ఇంటికి రాలేదా?, ఫారాలు ఇవ్వలేదా? అంటూ కొందరు రాజకీయ పార్టీల సోషల్ మీడియా కార్యకర్తలు, మరికొందరు నిర్ధారణ లేకుండానే పోస్టులు, కామెంట్లు చేయడం బిఎల్ఓల్లో అసంతృప్తికి దారి తీసింది. వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం వలన క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది మనోధైర్యం దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రజల నుండి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో పనులు నెమ్మదిగా సాగుతున్న విషయాన్ని గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం కూడా దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించింది. ఇది బిఎల్ఓల నిర్లక్ష్యం కాదని, ప్రజలకు మరి ంత అవకాశం కల్పించడానికేనని ఎన్నికల వర్గాలు పే ర్కొ ంటున్నాయి. అధికారిక సమాచారం లేకుండా సోషల్ మీ డియాలో విమర్శలు చేయడం కంటే...ప్రజలు తమ గ్రామంలోని బిఎల్ఓలను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న బిఎల్ఓల సేవలను గుర్తించి, ప్రజలు సహకరిస్తే ఓటరు జాబితా సవరణ కార్యక్రమం మరింత వేగంగా పూర్తవుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సోష ల్ మీడియాలో స్పందించే ముందు వా స్తవాలు తెలుసుకోవాలని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బ ంది శ్రమను గౌరవించాలనే అభిప్రాయం నెక్కొ ండ మండలంలో వినిపిస్తోంది.

# గుమస్తా కుటుంబానికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ మండలంలోని తుమ్మలకుంట ప్రాంతానికి చెందిన ప్రగతి హైస్కూల్ నందు నిరుపేద కుటుంబానికి చెందిన ముగ్గురు విద్యార్థులకు వరంగల్ హోల్‌సేల్ రిటైల్ కూరగాయల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 20వేల విలువైన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ కమిటీ వ్యవస్థాపకుడు బిట్ల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశ్యంతో తమ సంస్థ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ బాధ్యులు బేతి బలరాం, బండారి రమేష్, మంద రంజిత్, మేడారం శ్రీనివాస్, సర్వర్, గోపాల్, కోమటి రాజు, అభిలాష్, హరీష్, పాల్గొన్నారు.

## వైభవంగా శాకంభరీ ఉత్సవాలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానంలో జరుగుతున్న శాకంభరీ నవరాత్రి మహోత్సవాలు రెండవ రోజు ఘనంగా కొనసాగాయి. గురువారం తెల్లవారుజామున నిత్యాహ్నికాలు, దీక్షా హోమం, చతుస్థానార్చన నిర్వహించారు. అనంతరం తిథి మండల దేవతాయజనంలో భాగంగ అమ్మవారి షడ్వేరాల్లో జ్ఞానశక్తి స్వరూపిణిగా కపాలినీ మాత, క్రియాశక్తి స్వరూపిణిగా భగమాలినీ మాత అలంకారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాపాలినీ మాత ఆసురశక్తుల నుండి సృష్టిని రక్షించి దైవశక్తి విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, భగమాలినీ మాతను ఆరాధించడం వలన సత్సంతానం, సౌభాగ్యాలు సిద్ధిస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. ఈ మహోత్సవంలో పెద్ద స ం ఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## డిసిసి ఉపాధ్యక్షుడిగా మీర్జా ఇనాయత్

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ(డిసిసి) ఉపాధ్యక్షుడిగా మీర్జా ఇనాయత్(అక్తర్) నియమితులయ్యారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి మహేష్ కుమార్ గౌడ్, మంత్రి కొండా సురేఖ, మాజీ ఎంఎల్‌సి మురళీధర రావు, రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్ తదితరులతో సంప్రదింపుల అనంతరం ఈ నియామకాన్ని ప్రకటించారు. గత 24 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వివిధ హోదాల్లో సేవలందించిన ఇనాయత్ సేవలను గుర్తింపుగా ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. 2002లో యువ నాయకుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, డివిజన్ అధ్యక్షుడు, బ్లాక్ అధ్యక్షుడు, 40వ డివిజన్ అధ్యక్షుడిగా పనిచేస్తూ పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. 2021లో కార్పొరేటర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ టికెట్ కూడా పొందారు. రాజకీయాలతో పాటు క్రీడా రంగంలోనూ ఆయన సేవలందిస్తున్నారు. క్లాసిక్ క్రికెట్ క్లబ్ వ్యవస్థాపక చైర్మన్‌గా, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఈసి సభ్యుడిగా, జిల్లా కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నియామకంపై పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీనాయకత్వానికి మీర్జా ఇనాయత్ కృతజ్ఞతలు తెలిపారు.

## మానవ దేహం మట్టి పాలు చేయొద్దు

**ప్రజాపక్షం/నల్లబెల్లి :** మరణానంతరం మానవ దేహాన్ని సమాజహితం కోసం దానం చేయడం అత్యున్నత సేవ అని తెలంగాణ నేత్ర ,అవయావ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోనేరెడ్డి మల్లారెడ్డి అన్నారు. గురువారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని శనిగరం గ్రామానికి సిపిఎం పార్టీ నాయకుడు గత పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన కడియాల వీరాచారి మరణానంతరం పార్థీవ దేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు కాకతీయ మెడికల్ కాలేజీకి వైద్య విద్యా శాస్త్ర పరిశోధనల కోసం దానం చేయడంతో వారి కుటుంబ సభ్యులను అభినందిస్తు ప్రసంశ పత్రాలను అందజేశారు . సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ,రాష్ట్ర నాయకులు నాగయ్య ,రంగయ్య ,భూక్య సమ్మయ్యలతో పాటు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రమేష్‌లు పాల్గొన్నో వీరాచారి సంతాప సభలో తెలంగాణ నేత్ర, అవయావ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోనేరెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం నేత్రదానం చేయడంతో ఇద్దరు దృష్టి కోల్పోయిన వా రికి కంటి చూపును ప్రసదించిన వారమని చెప్పారు. మృతుడు కడియాల వీరాచారిని ఆదర్శంగా తీసుకోని మూడనమ్మకాలు ,అపోహలను వీడి దేహాదానానికి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు . ఈ కార్యక్రమంలో కూరకుల భారతి, వెంక న్న పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది మాటలు అనైతికం

**ప్రజాపక్షం/నల్లబెల్లి :** రైతులకు సాగు నీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ,నర్సంపేట నియోజకవర్గ రైతుల కోసం నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి చేస్తున్న పనులను మాజీ ఎంఎల్ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించడం అనైతిక చర్యలని వరంగల్ జిల్లా నల్లబెల్లి పిఏసిఎస్ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు అన్నారు. గురువారం నల్లబెల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి మాలోతు రమేష్‌తో కలిసి మాట్లాడారు. గత పదేండ్ల కాలంలో ఓపెన్ కెనాల్ పనులు ఎందుకు పూర్తి చేయ్యలేదని ప్రశ్నించారు. ఓపెన్ కెనాల్ తో రైతులకు సాగు నీరు అందిస్తుంటే సహకరించాల్సిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శించడం సరైంది కాదని సూచించారు . ఇప్పటికైనా మాజీ ఎంఎల్ఏ పెద్ది సుదర్శన్‌రెడ్డి సొంత డబ్బ మాటలు మానుకోని నియోజక వర్గ అభివృద్ధి సహకరించాలని కోరారు . ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్లు బత్తిని మల్లయ్య, మామిండ్ల రాజిరెడ్డి పాల్గొన్నారు .

## అనారోగ్యంతో మచ్కురి సుజాత మృతి

**ప్రజాపక్షం/రేగోడ్ :** మండల కేంద్రమైన రేగోడ్ లోని మూడో వార్డు మెంబర్ మచ్కురి సుజత అనారోగ్యంతో గురువారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందింది ఈ విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ ఫర్వీన్ సుల్తానా చోటు మియా, అక్కడికి చేరుకుని ఆ కుటుంబానికి 10,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసినట్లు తిలిపారు ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ శ్రీధర్ గుప్తా వార్డు సభ్యులు నాయకులు అంత్యక్రియలు పాల్గోన్నారు

## జిన్నారం సర్కిల్ కార్యాలయం , పోలీస్ స్టేషన్ తనిఖీ

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** వార్షిక తనిఖీలో బాగంగా గురువారం రోజు (16072026) జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ జిన్నారం సర్కిల్ కార్యాలయం ,పోలీస్ స్టేషన్‌లను సందర్శించారు. ఈ సందర్బంగా జిన్నారం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పటాన్‌చెరువు డిఎస్పీ తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ ఆవరణ పరిశుభ్రత సిబ్బంది బ్యారక్స్ స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సిబ్బందికి అందజేసిన కిట్ ఆర్టికల్స్ ను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాదీనపరచుకున్న కేసులకు సంబందించిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకుని క్రైమ్ సంబందించిన వాహనాలను సకాలంలో కోర్టులో డిపాజిట్ చేయాలని ఆన్‌క్లెయిమ్డ్ వాహనాలను బహిరంగ వేలం ద్వారా డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాదితులకు అండగా నిలవాలని సూచించారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో నమోదు చేసి ప్రతి రికార్డును ఆప్డేట్ గా ఉంచాలన్నారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామ పెద్దలు, యువతతో సమన్వయం శాంతిభద్రతలకు సంబందించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు.

## తెలంగాణ రక్షణ సేన సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జీ దయాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** తెలంగాణ రక్షణ సేన పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జీగా కలబ్‌గూర్ దయాకర్‌రెడ్డిని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందని తెలిపారు. ఈ సందర్బంగా దయాకర్‌రెడ్డి సంగారెడ్డిలో మీడియా సమావేశం నిర్వహించి పార్టీ విధివిదానాలు, భవిష్యత్తు కార్యాచరణను వెల్లడించారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ పాంచజన్య సిద్దాంతంతో ప్రజల్లోకి దూసుకెళ్తోందని స్పష్టం చేశారు. సమాజంలో ప్రతి రంగంలోనూ సామాజిక న్యాయం జరగాలని, అందరికి సమానత్వం అందించడమే పార్టీ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఉన్న ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని దయాకర్‌రెడ్డి ఆవేధన వ్యక్తం చేశారు. నియోజకవర్గం ఇన్‌చార్జీ గా ఇక్కడి ప్రజల రైతుల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన తరపున ఎల్లప్పుడు ముందుండి పోరాడుతానని కలబ్‌గూర్ దయాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. సమావేశం టీఆర్‌ఎస్ నాయకులు, గోపాల్‌రెడ్డి, శంకర్‌నాయక్, మనోజ్ రెడ్డి, నితీన్, ధనుష్, గోపాల్, యాదవ్, ప్రదీప్, రజనీకాంత్, అనూప్‌రెడ్డి ,వేణు, శివ, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.

### హామీలు గాలిలో కలిశాయా..?

# ప్రగతి ధర్మారంలో ప్రజల ఆవేదన..

**ప్రజాపక్షం/రామాయంపేట :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్రామసభల్లో చేసిన తీర్మానాలు అమలుకు నోచుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో ప్రజా సమస్యలు పరిష్కారం చేయడంలో సర్పంచు విఫలమవుతున్నారనే ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో అత్యవసర సమస్యలను పక్కన పెట్టి ప్రదాన రహదారి పక్కన సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వాటర్ ట్యాంకు సమీపంలోని వీదిలో నెలకొన్న బురద, నీటి నిల్వ సమస్యను ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిదుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడంలేదని, తాగునీరు నిరంతరం వృథాగా పారుతుండడంతో రోడ్డంతా బురదమయంగా మారుతుంది. దీంతో చిన్నపిల్లలు, వృద్దులు, మహిళలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఎక్కడ సీసీ రోడ్డు వేసినా ముందుగా ఈవీదిలోనే వేస్తామని సర్పంచు హామీ ఇచ్చారని, అయితే నిదులు వచ్చిన తర్వాత ఆహామీని విస్మరించి హైవే పక్కన ఉన్న ప్రాంతాల్లో మాత్రమే అభివృద్ధి పనులు చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులు ఇప్పుడు సోషల్



మీడియా గ్రూపులో వరుస పోస్టులు పెడుతూ వాటర్ ట్యాంకు సమీపంలోని అద్వాన్న పరిస్థితులను ఫోటోలు, వీడియోల ద్వారా పంచుకుంటున్నారు. ఎన్నికల సమయంలో గుర్తుకొచ్చిన ప్రజలు ఇప్పుడు ఎందుకు కనిపించడలేదు..మా వీది పంచాయతి పరిదిలోకి రాదా..అంటూ ప్రశ్నలు సందిస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు సమానంగా జరుగాలని, ప్రజల అవసరాల ఆదారంగా నిదులను వినియోగించుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంకు సమీపంలోని సమస్యను శాశ్వతంగా పరిష్కరించి సీసీ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

## దాసరిబస్తీలో సమ్మక్క-సారలమ్మ బోనాల వేడుకలు



**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట మున్సిపాలిటి పరిదిలోని 1వ వార్డు దాసరి బస్తీ కాలనీవాసుల ఆరాధ్యదైవమైన సమ్మక్కసారలమ్మ దేవతల బోనాల పండుగ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు ఉత్సవాలకు హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్బంగా చైర్మెన్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర వ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుబిక్షంగా ఉండాలని, రామాయంపేట మండలం, పట్టణ ప్రజలందరు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్బంగా దాసరిబస్తీ భక్తులతో కిక్కిరిసిపోయింది. మహిళలు సాంప్రదాయ వస్త్రదారణతో బోనాలు సమర్పించగా యువకులు, చిన్నారులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, గుగులోతు రవినాయక్, బైరం స్వప్న కుమార్, దేవుని రంజిత్, దాకి శ్యామల స్వామి, డీసీసీ కార్యదర్శి పోచమ్మల గణేష్, నాయకులు అనిల్ చింతల స్వామి, తొంటవాలి యాదగిరి, గావు బాస్కర్, అసది రాజు, గావు సురేందర్, యూత్ కాంగ్రేస్ నాయకులు విరాట్, భాను సుదీర్, గణేష్, నరేష్, సాయితో పాటు తదితరులు ఉన్నారు.

## రామాయంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి కోసం పోరాడింది బీజేపీనే...

**ప్రజాపక్షం/రామాయంపేట :** రామాయంపేట ఆద్యా గ్రాండ్ బైపాస్ వద్ద తరుచు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం మొదటి నుండి నిరంతరం పోరాటం చేసింది భారతీయ జనతా పార్టీ మాత్రమేనని ఆపార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు పేర్కొన్నారు. ఫ్లైఓవర్ విషయంలో కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని ఆయన ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కేంద్ర రోడ్డు రవాన శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబందించి వినతిపత్రం సమర్పించారని, అనంతరం నేషనల్ హైవే అథారిటి అధికారులతో నిరంతరం అనుసందానం చేస్తూ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. ఈ కృషి ఫలితంగానే జూన్12 డిపిఆర్ సిద్దమై కేంద్రానికి పంపించబడిందని దీనికి అధికారిక పత్రాలన్ని తమ వద్ద ఉన్నాయని చెప్పారు. ఎవరి మాటలను నమ్మాల్సిన అవసరం లేదని ఆదారాలతో మాట్లాడే సంస్కృతి బీజేపిదేనని రాగిరాములు స్పష్టం చేశారు. గతంలో ప్రమాదాల నివారణ కోసం నేషనల్ హైవే అథారిటి నిర్మించిన రక్షణ గోడను కొందరు బిఆర్ఎస్ నాయకులు కూల్చివేశారని అందుకు సంబందించిన ఫోటోలో కూడా తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అధికారులు చేపట్టిన చర్యలను అడ్డుకున్న దృశ్యాలకు సంబందించిన ఆదారాలను అవసరమైతే ప్రజల ముందు ఉంచేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. ఇప్పుడు అదే నాయకులు ఫ్లైఓవర్ కోసం తామే పోరాడమని చెప్పడం రాజకీయ ఉనికి కోసం చేస్తున్న ప్రయత్నమే తప్ప వాస్తవం కాదని విమర్శించారు.

## ఇస్కాన్ ఆద్వర్యంలో వైభవంగా రథయాత్ర

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆద్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర 2026 భక్తి శ్రద్దల నడుమ అత్యంత వైభవంగా జరిగింది . టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుంచి ప్రారంభమైన రథయాత్ర పట్టణ ప్రధాన వీధుల గుండా పీఎస్ఆర్ గార్డెన్ వరకు సాగగా వేలాది మంది భక్తులు పాల్గొని హరినామ సంకీర్తనలతో ఆద్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. రథం వెంట సాగిన భజనలు, సంకీర్తనలు, ఆద్యాత్మక నృత్యాలు మహిళలు సంప్రదాయ వస్త్ర దారణలో ప్రదర్శించిన కోలాటాలు, యాత్రకు ప్రత్యేక ఆకర్షణంగ నిలిచి వీక్షకులను ఆకట్టుకున్నాయి. యాత్ర మార్గమంతా భక్తులు, జగనాథ్ కి జై నినాదాలతో స్వామి వారి నామస్మరణ చేస్తూ భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. భక్తులకు ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణి చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా సంగారెడ్డిలో జగన్నాథ రథయాత్రను నిరంతరాయంగా నిర్వహిస్తూ ఆద్యాత్మిక చైతన్యాన్ని విస్తరిస్తున్న ఇస్కాన్ స్థానిక శాఖ ప్రతినిధులను జగ్గారెడ్డి అభినందించారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి భక్తీ గీతాలు ఆలపించి కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చారు. సమాజంలో ఆద్యాత్మక విలువలు, సేవభావం , సామరస్య భావన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్‌కిషన్, ప్రముఖ నాయకులు కూన సంతోష్ ,సంగారెడ్డి పట్టణ అద్యక్షుడు కిరణ్‌గౌడ్, ఇస్కాన్ ప్రతినిదులు, పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేగోడ్ లో ఓమోస్తరు వర్షం

**ప్రజాపక్షం/ రేగోడు :** మండల కేంద్రంలో గురువారం రేగోడ్ లో ఓ మోస్తరు వర్షం కురిసింది ఆరుతడి పంటలకు పత్తి కంది పెసరి మినుము కూరగాయలకు పంటకు అనుకూలంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేశారు

## రోడ్డు ప్రమాద బాదితుడికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**ప్రజాపక్షం/రామాయంపేట :** గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందిన ఆర్.వెంకటాపూర్ గ్రామానికి చెందిన నడిపొల్ల అరుణ్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సర్పంచు వెంకుగారి ఉమా సంజీవరెడ్డి గురువారం బాదితునికి అందజేశారు. ఈసందర్బంగా సర్పంచు మాట్లాడుతూ ప్రజలు ఆపదలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి సహాయనిది ఆర్థికంగా ఎంతో అండగా ఉంటుందన్నారు. వైద్య చికిత్సల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మద్య తరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచు అనురాద నరేష్, వార్డు సభ్యులు నాగరాణి రాజాగౌడ్, పుర్ర స్వామి, కారోబార్ రత్నం, రేఖయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## మాజీ ఎంపీని కలిసిన మహిళా మోర్చా అధ్యక్షురాలు

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట్ :** మెదక్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలుగా డాక్టర్ పట్లోళ్ల మల్లికా నియమితులైనందున జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బీ బీ పాటిల్ మహిళా పట్లోళ్ల మల్లిక ను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ ని బలోపేతం చేయాలని మహిళల్లో చైనత్యం తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అశోక్, రాజు ఉన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు అందజేత

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం లింగోజిగూడ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా సహకారంతో పాఠశాలకు చెందిన విద్యార్థులకు నేషనల్ వాలీబాల్‌ప్లేయర్ పిల్లుట్ల సంద్ర వినోద్ చేతులమీదుగా స్కూల్ బ్యాగులు అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు సహకారం అందజేసినందుకు మహేశ్‌గుప్తాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సుమన్, అరుణ్ తదితరులు ఉన్నారు.

## గ్రామీణాభివృద్ధి పనుల్లో జాప్యానికి తావివ్వొద్దు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** జిల్లాలో చేపడుతున్న గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో ,నిబద్దతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎల్పీవోలు, డీపిఎంలు,ఎంపిడీఓలు ఎంపిఓలు, ఏపిఓలు ,ఏపీఎంలు, పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలు, ఏఈలు, తదితర అధికారులతో ఏవోభవనాలు,గ్రామ పంచాయతీ, అంగన్‌వాడి భవనాల నిర్మాణాలు ,పాఠశాల మరుగుదొడ్లు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌లు వ్యక్తి గత గృహ మరుగుదొడ్లు , ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పాఠశాల కాంపౌండ్ వాల్స్ కల్వర్టులు, డ్రైనేజీ పనులు, ఎస్‌హెచ్‌జీ పెడరేషన్ భవనాలు, తాగునీటి సరపరా తదితర అంశాలపై మండలాల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏవో భవనాల నిర్మాణ పనులను యుద్దప్రాతిపదికన పూర్తి చేయాలని అదికారులను ఆదేశించారు. కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా త్రాగునీటీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లను పూర్తి స్థాయలో వినియోగానికి అనుకూలంగా ఉండేలా స్ట్రీమ్‌లైన్ చేయాలని మరుగుదొడ్లు అవసరమైన పాఠశాలలకు కొత్త టాయిలెట్లు నిర్మాణానికి సంబందించిన అంచనా ప్రతిపాదనలు వెంటనే సిద్దం చేసి సమర్పించాలని ఆదేశించారు. అలాగే అవసరమైన పాఠశాలల్లో కాంపౌండ్ వాల్ నిర్మాణాలు ,అంచనా ప్రణాళికలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామీణాబివృద్ధి లో ఎంపిడిఓల పాత్ర అత్యంత కీలకమని మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

# టిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తా

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేస్తానని ఆ పార్టీ నూతన నియోజకవర్గ ఇంచార్జి అపర్ణ అన్నారు. నర్సాపూర్ తెలంగాణ రక్షణ సేన పార్టీ ని యోజకవర్గ ఇన్చార్జిగా అపర్ణను ఆ పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత నియమించడం పట్ల గురువారం నర్సాపూర్ లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నూతన నియోజకవర్గ ఇన్చార్జి అపర్ణ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత, తనపై నమ్మకంతో నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించినందుకు పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేస్తానని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఎగరవేయడంతో పాటు కల్వకుంట్ల కవితను తొలి మహిళా ముఖ్యమంత్రిగా తీసేందుకు కృషి చేస్తానని అన్నారు. తనను నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించినందుకు తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితకు, నియామకానికి కృషిచేసిన నాయకులు గణేష్, రామచంద్ర రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలంగాణ రక్షణ సేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి అపర్ణ తెలిపారు.

# ప్రమాదకరమైన బావిని పూడ్చారు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలం నస్కల్ రాంపూర్ వెళ్లే రోడ్డు మార్గంలో ఓ మూలమలుపు వద్ద బావి ప్రమాదకరంగా ఉంది. సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకుపోగా, సర్పంచ్ నాతి అంజమ్మ లక్ష్మాగౌడ్, కార్యదర్శి మమత, ఉపసర్పంచ్ దేవరాజ్ లు ప్రమాదకరమైన బావిని పూడ్చి వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ఈ రోడ్డు గుండా ప్రయాణికులు రాంపూర్, చిన్న నిజాంపేట్, కూడవెళ్ల, ఖంపల్లి, సిద్దిపేట ఇతర ప్రాంతాలకు వందలాదిమంది ప్రయాణికులు ఈ దారియంబడి వెళ్తుంటారు.

# 'సర్' పూర్తిచేసిన బిఎల్ఓ కు సన్మానం



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నిజాంపేట మండలంలో మొట్టమొదటిగా వంద శాతం ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసిన నందగోకుల్ బిఎల్ఓ అంతం జ్యోతి ని స్తానిక తహసిల్దార్ శ్రీనివాస్, మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు భాను ప్రకాష్ రెడ్డి లు శాలువాతో ఘనంగా సన్మానించి బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బిఎల్ఓ ల పాత్ర కీలకమని, ప్రతి అధికారి నిబద్దతతో తమ విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కుమార్, జి పి ఓలు వనజ, అమర్, పాలకవర్గం సభ్యులు, మ్యాదరి నర్సింలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సీజనల్ వ్యాధులకు సంబంధించి మెడిసన్ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని..ప్రజలు వీటి బారిన పడకుండ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హైమావతి వైద్యులకు సూచించారు. నంగునూర్ మండలం రాజగోపాల్‌పేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అకస్మీకంగా తనిఖీ చేశారు. రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ మండలంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండ మెడిసన్, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని పిహెచ్‌సి పరిధిలోని యుపిహెచ్‌సి ఎఎన్ఎం సూపర్‌వైజర్ ద్వారా ప్రజల్లో సీజనల్ వ్యాధులకు సంబంధించి అవగాహన కల్పించాలని మెడికల్ అధికారిని ఆదేశించారు. ఓపి ఎంత. ఆసుపత్రి సిబ్బంది అందరు వచ్చారా అని ఆరా తీశారు. అటెండెన్స్ లీవు లెటర్లు. ఓపి రిజిస్టర్ వేరిపై చేశారు. రోజు 50 నుండి60 మంది ఓపి ఉంటారని అందరు వచ్చారని కలెక్టర్‌కు తెలిపారు. మెడికల్ ఆఫిసర్ నుండి సిబ్బంది సమయపాలన పాటించాలని .రోగులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. పిహేచ్‌సికి వచ్చిన రోగులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవాలని సూచించారు. వైద్యులు అందించిన మందులు, మంచి ఆహార అలవాట్లు. అలవర్చుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

# మెదక్ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి కార్యాచరణ



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు టూరిజం కన్సల్టెంట్లు శ్రవంతి గుప్తా, భువన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారు నర్సాపూర్ అర్బన్ పార్క్, పార్క్ కాటేజీలు, వెంకట్రావు పేట కోట, మెదక్ ఖిల్లా ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతులు, సుందరీకరణ, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, దిశా సూచిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక కళలు, హస్తకళలు, చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు తెలిపారు. మెదక్‌ను తెలంగాణలో ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రమేష్ గంగాల, ఇ డి యం సందీప్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మ ణ్, అధికారులు, పర్యాటక శాఖ ప్రతినిధులు, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీసీ చార్జీలను ప్రభుత్వమే భరించాలి

## ఎంపిడిఓ సిబ్బందికి సర్పంచ్ ల వినతి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** గ్రామపంచాయతీ సీసీ చార్జీలను ప్రభుత్వమే భరించాలని నర్సాపూర్ మండల గ్రామ పంచాయతీ సర్పంచ్ లు గురువారం ఎంపీడీవో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లు మాట్లాడుతూ, నూతనంగా సర్పంచ్లుగా ఎన్నికైన నుంచి వచ్చిన నిధులను పాత సర్పంచ్‌ల బిల్లులు, ప్రత్యేక అధికారుల పాలనలో చేసిన బిల్లులను చెల్లించినప్పటికీ ఇంకా బకాయిలు ఉన్నాయన్నారు. పాత బకాయిలకు సంబంధించిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని నీటి మరియు విద్యుత్ కు సంబంధించిన సీసీ చార్జీలను ప్రభుత్వమే భరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులను మంజూరు చేయనప్పటికీ సీసీ చార్జీలను చెల్లించాలని ఒత్తిడి తీసుకురావడం భావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# సిసి కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలి

## విధుల్లో క్రమశిక్షణ పాటించాలి రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** గురువారం తూప్రాన్ డి.యస్.పి యగు జే.నరేందర్ గౌడ్, నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను సంవత్సర సందర్శనలో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, పలు అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించిన డి.యస్.పి, వాటి దర్యాప్తు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల విచారణను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు.స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పని తీరును కూడా పరిశీలించి, ముఖ్య కూడళ్లు మరియు ప్రమాదకర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, పోలీస్ ఆఫిసర్స్ యొక్క కిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి, తగు సూచనలు చేశాడు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంగ కృష్ణ, సిఐనర్సాపూర్ సర్కిల్, రంజిత్ రెడ్డి, పియస్, కృష్ణయస్.ఐ, ఏఎస్ఐ లు శివకుమార్, ముజీబ్ అహ్మద్, సుందర్ రాజు, స్టేషన్ రైటర్‌సురేష్, మరియు ఇతర పోలీస్ సిబ్బంది, ఉన్నారు.

# ప్రజల అభ్యున్నతి కోసమే.. కాంగ్రెస్ ప్రభుత్వం

## షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని పోడ్చన్ పల్లి లో మత్స్యకార సంఘ సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లను ప్రారంభించి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం పాపన్నపేట ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి. ప్రజా సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పార్టీ నాయకులు, ఆకుల శ్రీనివాస్, భూమయ్య, షఫీ, కలీం, గౌస్, శ్రీధర్, రాజశేఖర్, గణేష్, రాజు, కిష్టయ్య, ప్రవీణ్ గౌడ్, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాఠశాలలో కథక్ నృత్య ప్రదర్శన

**ప్రజాపక్షం/పాపన్నపేట :** భారతీయ శాస్త్రీయ సంగీతం, నృత్యం, సంస్కృతి, వారసత్వాన్ని యువతకు చేరవేసి వాటి పట్ల ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో స్పిక్ మెకే సంస్థ పనిచేస్తుందని కథక్ కళాకారిణి అనిష్క అగర్వాల్ వెల్లడించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో పాపన్నపేట ఉన్నత కేజీబీవీ పాఠశాలల్లో కథక్ నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కథక్ కళాకారిణి అన్షికా అగర్వాల్ కథక్ నృత్య చరిత్ర, సంప్రదాయం, అభినయం, తాళం, లయ, హస్తముద్రలు, పాద విన్యాసాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రత్యక్ష నృత్య ప్రదర్శనతో విద్యార్థులను ఆకట్టుకుని, భారతీయ శా)య కళల విశిష్టతను తెలియజేశారు.

# నేల ఆరోగ్యం భూసార పరిరక్షణకు జిప్సం పంపిణి

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట్ :** పెద్ద శంకరం పేట మండల కేంద్రంలో రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం సబ్సిడీపై జిప్సం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యసాయ అధికారి నాగం కృష్ణ మాట్లాడుతూ చౌడు(క్షార) భూములను సాగుకు అనుకూలంగా మార్చడంలో జిప్సం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. జిప్సంలో ఉండే కాల్షియం, సల్ఫర్ వల్ల వరి పంటకు బలమైన వేర్లు, ఎక్కువ పిలకలు, మెరుగైన దిగుబడి లభిస్తాయని చెప్పారు. అలాగే నేలలో పేరుకుపోయిన సోడియంను తొలగించి భూమి భౌతిక స్థితిని మెరుగుపరుస్తుందని వివరించారు. చౌడు తీవ్రతను బట్టి ఎకరాకు 500 కిలోల నుంచి 2 టన్నుల వరకు జిప్సం వాడాలన్ని, వరి నాట్లకు 1520 రోజుల ముందే పొలంలో చల్లి దుక్కి దున్ని నీటితో మాలిచింగ్ చేయాలని రైతులకు సూచించారు. రైతులు మట్టి పరీక్షల ఆధారంగా జిప్సం వినియోగించి భూసారాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పాకాల తూములు ఎత్తి, నారుమళ్లకు వెంటనే నీటిని విడుదల చేయాలి

ఖానాపూర్ మండల కేంద్రం నుండి 200 బైక్‌లతో పాకాల తూము వరకు భారీ ర్యాలీ..

**ప్రజాపక్షం/ నర్సంపేట :** వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని చారిత్రాత్మక పాకాల సరస్సు తూము గేట్లను వెంటనే ఎత్తి, ఎండిపోతున్న నారుమళ్లకు, సాగు భూములకు నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మహాలక్ష్మి వెంకట నరసయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. వానకాలం సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా, రైతులు సాగు పనుల్లో నిమగ్నమైనా..స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మరియు కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరమైన నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారు.నీరు అందక రైతులు పోసిన నారుమళ్లు బీడు వారుతుంటే, ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే మాత్రం కాలయాపన చేస్తూ అన్నదాతల పొట్ట కొడుతున్నారు.....ఈ రోజు (జూలై 16) నాటికి పాకాల తూములు ఎత్తి నీటిని విడుదల చేయకపోతే రైతులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులే స్వయంగా గేట్లు ఎత్తుతామని ముందే హెచ్చరించడం జరిగింది. ఇందులో భాగంగానే ఈరోజు ఖానాపూర్ మండల కేంద్రం నుండి దాదాపు 200 బైక్‌లతో బీఆర్ఎస్ నాయకులు, రైతులు భారీ ర్యాలీగా బయలుదేరి పాకాల తూము వద్దకు చేరుకున్నారు. పోలీసుల ఆంక్షలను, అడ్డంకులను ఛేధించుకుంటూ ముందుకు సాగి, చివరకు పాకాల తూము గేట్లను తెరిచి నారుమళ్లకు సాగునీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కృషితో నిండిన పాకాల, నేడు కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల ఎడారిగా మారిందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, దశాబ్దాల నాటి రైతాంగ కలను సాకారం చేశారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను పాకాలకు తరలించేందుకు రామప్ప సరస్సు నుండి పాకాల వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా పైప్ లైన్ ప్రాజెక్టును పూర్తి చేయించారు. కెసిఆర్ సహకారంతో కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి, డబ్బావాగు మీదుగా గోదావరి జలాలను పాకాల సరస్సులోకి తెచ్చి, రెండు పంటలకు ఢోకా లేకుండా నిరంతరం నీరుండేలా ప్రణాళిక చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అంత కష్టపడి ప్రాజెక్టును నింపి సిద్ధంగా ఉంచితే, నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల నిర్లక్ష్య ధోరణి వల్ల ఆ నీటిని రైతులకు సమయానికి విడుదల చేయలేక చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, పోలీసులను అడ్డుపెట్టుకుని నిరసనకారులపై లాఠీఛార్జ్ చేయడం, అక్రమంగా అరెస్టులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. రామప్పపాకాల లింక్ ద్వారా లభ్య



తగా ఉన్న నీటిని ఎలాంటి ఆలస్యం లేకుండా పాకాల తూముల ద్వారా నారుమళ్లకు నిరంతరాయంగా అందేలా చూడాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ప్రభుత్వం తమ మొండి వైఖరిని వీడి ఎండిపోతున్న పంటలను కాపాడి, అన్నదాతలను ఆదుకోవాలన్నారు. రైతుల కోసం పోరాడుతున్న బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు , నర్సంపేట మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఖానాపురం గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ లను పోలీసులు అరెస్టు చేసి ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారని, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, జిల్లా నాయకులు బూస అశోక్, వల్లెపు శ్రీనివాస్, బందరపు శ్రీను,వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు...

# 16వ వార్డు కౌన్సిలర్ బానోత్ నవీన్ నాయక్‌పై దాడి

**ప్రజాపక్షం/ నర్సంపేట :** దహన సంస్కారాలకు వీగతం కలుగుతోందని కొద్ది సేపు మట్టి ట్రాక్లరు ఆపని కోరిన తనపై మట్టిమాఫీ దారులు దాడిచేసినట్లు 16వ కౌన్సిలర్ నవీన్ నాయక్ ఆరోపించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఎదుట విలేకరులతో కౌన్సిలర్ నవీన్ నాయక్ మాట్లాడుతు నర్సంపేట పదట్టణంలోని నాగుర్లపల్లి గ్రామంలో ఒక వ్యక్తి చనిపోగా దహన సంస్కారాలు చెరువు శిఖంలోని శ్మశాన వాటికలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేశారు. అయితే దహన సంస్కారాలకు వీగుతాం కలుగుతుంది కొద్దిసేపు మట్టి ట్రాక్టర్లు ఆపమని మొరం వ్యాపారిని కోరగా ఆపడానికి నువ్వు ఎవడివిరా అంటూ ఫోన్లో బెదిరించడం జరిగిందని, ప్రత్యక్షంగా వెళ్లి ఆపాలని కోరగా అక్కడ వున్న మొరం వ్యాపారులు విచక్షణ రహితంగా కర్రలతో ,రాళ్ళతో దాడి చేసి ఇష్టానుసారంగా తిడుతూ చంపడానికి ప్రయత్నించారన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తోలూతు గ్రామాలలో ఉన్న ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఈ రకంగా మనుషుల ప్రాణాలు పోయినా కూడా ప్రభుత్వంగాని, పోలీసులు గాని సదరు అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. దాడిచేసిన వారిపై నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

# పెద్దంపల్లిలో మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**ప్రజాపక్షం/జమ్మికుంట :** గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు పరిసరాలను, వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ పోషకాహారాలను తీసుకోవడం వల్లనే ఆరోగ్యంగా జీవించవచ్చని జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామ సర్పంచ్ ఎగిత పద్మ కుమార్ అన్నారు. గురువారం బాలవికాస ఆధ్వర్యంలో గ్రామంలోని పాఠశాల ఆవరణలో జమ్మికుంట ఆదిత్యఅమృత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ మా ట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త తీసుకోవాలని ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని కోరారు.

చిన్న చిన్న మార్పులతో రోగాల బారిన పడకుండా జీవించవచ్చని తెలిపారు. ఆదిత్యఅమృత ఆసుపత్రుల యాజమాన్యం 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేయడమే కాకుండా 55 వేల రూపాయల విలువ గల మందులు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

గ్రామానికి వచ్చిన స్పెషలిస్ట్ వైద్యులను సర్పంచ్ ఘనంగా సత్కరించారు. ప్రముఖ వైద్యులు భరత్, శ్రీనివాస్, మహిపాల్‌లు మాట్లాడుతూ సమతుల్య ఆహారాలను తీసుకోవాలని తెల్లటి ఉత్పత్తులైన బియ్యం, రవ్వ, పిండి, చక్కెర సాధ్యమైనంతవరకు నివారించాలని కోరారు.

కార్బోహైడ్రేట్స్ అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల ఉబకాయం పెరిగి షుగర్ వ్యాధి, బిపి, గుండె, కిడ్నీల వ్యాధులు ప్రబలుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

బాలవికాస కార్యక్రమాలను నిర్వహించే 14 సెంటర్ల పరిధిలో 180 గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ దాదాపు 2 కోట్ల రూపాయల విలువ గల మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని ఆయా సెంటర్లలోని దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. బాలవికాస విలేజ్ లీడర్ పి.రమ, ఆదిత్య హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, రఫిక్, దుర్గా ప్రసాద్, హాస్పిటల్ స్టాఫ్ అనిల్ రావు, మహేశ్, శ్రావణ్, సంతోషిని, పూజ, శ్రావ్య, సుమలత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు

వ్యవసాయ విస్తరణ అధికారి మెండు అశోక్

**ప్రజాపక్షం/నర్సంపేట :** పత్తి పంట సాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని గురిజాల వ్యవసాయ విస్తరణాధికారి మెండు అశోక్ వివరించారు. 30 రోజుల పత్తి పంటదశలో (మొక్క ఎదుగుదల, కొమ్మలు తొడిగే దశ) పరిస్థితులను తట్టుకోవడానికి రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్, 10 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటికి కలిపి ఆకులపై పిచికారి చేయడం ద్వారా మొక్కలు వాడిపోకుండా కాపాడుకోవచ్చని, వరసల మధ్య గుంటుక (అంతరకృషి) తోలడం ద్వారా పై మట్టి లూజ్ అయి, భూమిలోని తేమ ఆవిరి కాకుండా ఉంటుందని, 30 రోజుల దశలో కలుపు ఎక్కువగా ఉంటుందని, ఇది భూమిలోని కొద్దిపాటి తేమను కూడా లాగేస్తుంది. కావు న కలుపును వెంటనే తొలగించాలన్నారు. వర్షం పడి, భూమిలో పదును (తేమ) వచ్చే వరకు యూరియా లేదా కాంప్లెక్స్ ఎరువులను నేలలో వేయకూడదన్నారు. మొక్క లు పసుపు రంగులోకి మారకుండా, ఎదుగుదల ఆగకు ండా ఉండటానికి 1శాతం మల్టీకె ద్రావణా న్ని పిచికారి చేయవచ్చని, బెట్ట వాతావరణంలో తామర పురుగులు, పేనుబంక ఎక్కువగా ఆశిస్తాయి. వీటి నివారణకు ఎకరాకు 6 080 మిల్లీలీటర్ల ఇమిడాక్లోప్రిడ్ లేదా 40 గ్రా ముల ఎసిటామిప్రిడ్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి చేయాలి.

# సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్‌గా కందుల శ్రీనివాస్

**ప్రజాపక్షం/నర్సంపేట:** గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ గా కందుల శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ గా నియమిస్తూ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ గురువారం నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ నెల 12 సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో జరిగిన గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో కందుల శ్రీనివాస్ గౌడ్ ను నియమిస్తున్నట్లు జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ తో కలిసి ప్రకటన చేసిన నర్సాగౌడ్ కందుల శ్రీనివాస్ గౌడ్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల హక్కుల సాధన కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోకుదెబ్బ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా బాధ్యత వహించాలన్నారు. నూతనంగా ఎన్నికైన మోకుదెబ్బ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ కందుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ సిద్ధాంతాలు, కార్యక్రమాలు, గౌడ్ సమాజ హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, సంస్థకు బలమైన డిజిటల్ వేదికను నిర్మించడం లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ గా బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం నరసింహులు గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దెల సాంబయ్య గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకటేశ్వర్లు గౌడ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

# వార్డ్ కౌన్సిలర్ నవీన్ నాయక్‌పై దాడిని ఖండిస్తున్నాం

ఎంసిపిఐ(యు) జిల్లా నాయకులు కొత్తకొండ రాజమౌళి ,కేశెట్టి సదానందం

**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని నాగుర్లపల్లి 16వ వార్డు కౌన్సిలర్ బానోతు నవీన్ నాయక్ పై కొంతమంది అకారణంగా దాడి చేయడాన్ని ఎంసిపిఐ(యు) పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని పార్టీ జిల్లా నాయకులు కొత్తకొండ రాజమౌళి, కేశెట్టి సదానందంలు అన్నారు. మాదన్నపేట పెద్ద చెరువులో గత కొన్ని రోజులుగా జెసిబి, ట్రాక్టర్లతో అక్రమంగా మొరం తరలిస్తున్న ఎవరు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. గురువారం నవీన్ నాయక్ నాగుర్లపల్లి గ్రామ ం లో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్న క్రమంలో అం త్యక్రియలకు ఆటంకంగా మారుతున్నదని, మట్టి తరలింపు ఆపాలని చెరువు వద్దకు వెళ్లి కోరిన క్రమంలో అకారణంగా జెసిబి డ్రైవర్, ట్రాక్టర్ డ్రైవర్లు అతనిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి చర్యలను ప్రజలంతా మూకుమ్మడిగా అడ్డుకోవాలని, ఈ దాడికి బా ధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమా ండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కేశెట్టి శ్రీనివాస్ ,జవాజి చంద్రమౌళి ,కందికొండ నరసింహస్వామి పాల్గొన్నారు .

# క్యాన్సర్ చికిత్సలో సరికొత్త విప్లవం




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స రంగంలో సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెస్తూ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ తాజాగా 'ఇన్‌హౌస్ నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ ఎన్‌జిఎస్ సదుపాయాన్ని ప్రారంభించినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. క్యాన్సర్ రోగుల జన్యు నిర్మాణాన్ని విశ్లేషించి, వారికి అత్యంత ఖచ్చితమైన, వ్యక్తిగతీకరించిన వైద్యం అందించడంలో ఈ సాంకేతికత కీలక మైలురాయిగా నిలవనుంది. గురువారం రోజున హనుమకొండ యశోద క్లినిక్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ శిఖర్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యరంగం సాంప్రదాయ అందరికీ ఒకే రకమైన చికిత్స విధానం నుండి 'ప్రెసిషన్ ఆంకాలజీ' వైపు వేగంగా అడుగులు వేస్తోందని, ఆధునిక చికిత్సలైన టార్గెటెడ్ ఓరల్ థెరపీలు, ఇమ్యూన్ చెక్‌పాయింట్ ఇన్హిబిటర్స్ వంటి రోగుల జీవనకాలాన్ని, వారి జీవన నాణ్యతను గణనీయంగా పెంచుతున్నాయని, ఈ నేపథ్యంలో, యశోద హాస్పిటల్స్ సొంతంగా ఇన్‌హౌస్ ఈ ఎన్ జి ఎస్ ల్యాబ్ ఏర్పాటు చేయడం విశేషం. ఇన్‌హౌస్ ఎన్ జి ఎస్ వల్ల కలిగే ముఖ్య ప్రయోజనాలు, వేగవంతమైన నివేదికలు, ఆసుపత్రి ప్రాంగణంలోనే ఈ పరీక్షలు నిర్వహించడం వల్ల రోగి యొక్క జన్యుపరమైన మార్పులను అత్యంత వేగంగా, ఖచ్చితంగా గుర్తించవచ్చునని తెలిపారు.పరీక్షా ఫలితాల ఆధారంగా ఆంకాలజిస్టులు ప్రతి రోగి ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా చికిత్సను డిజైన్ చేయడానికి వీలవుతుందని తెలిపారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల లుంగీ , రొమ్ము బ్రెచ్ , జీర్ణాశయ సంబంధిత గ్యాస్ట్రాయింటెస్టినల్ క్యాన్సర్లతో పాటు ఇతర కణితుల తుమర్స్ చికిత్స నిర్ణయాలలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.సొంతంగా ఎన్ జి ఎస్ సదుపాయాన్ని ప్రారంభించడం ద్వారా ప్రెసిషన్ ఆంకాలజీ విభాగంలో యశోద హాస్పిటల్స్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. అత్యాధునిక సాంకేతికతను రోగులకు మరింత వేగంగా, చేరవ చేయడమే తమ లక్ష్యం అని ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది. ఒకే గూటి కింద ప్రపంచ స్థాయి క్యాన్సర్ కేర్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌లో ఇప్పటికే అత్యంత అనుభవజ్ఞులైన మల్టీడిసిప్లినరీ క్యాన్సర్ నిపుణుల బృందం అందుబాటులో ఉందని, అత్యాధునిక రోబోటిక్ ఆంకోసర్జరీ, భారతదేశంలోనే తొలి రేడియేషన్ థెరపీ వ్యవస్థలతో పాటు, ఇప్పుడు ప్రారంభమైన ఎన్ జి ఎస్ సదుపాయంతో క్యాన్సర్ రోగులకు ఒకే చోట పూర్తిస్థాయి, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సమగ్ర వైద్య సేవలు లభించనున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది సాయి వెంకట్, విజయ్ కుమార్,అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.